క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి చెన్నైకి చెందిన గురుస్వామి నాథన్, బాబుజనార్దన్ కుటుంబ సభ్యులు రూ.25వేల విరాళాన్ని అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ బుధవారం తెలిపారు. దాతలు చౌడేశ్వరిదేవి అమ్మవారి పై ఉన్న భక్తితో ఈ విరాళాన్ని అందజేశారన్నారు. ఆలయం తరుపున దాతలకు అమ్మవారి ప్రసాదం అందజేశారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

డోన్ రూరల్ : మున్సిపల్ కార్మికులు ఔట్‌సోర్సింగ్‌లో అప్కాస్ విధానంలో కొనసాగుతున్నారని, వారందరినీ రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, డోన్ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మికులను కంట్రాక్ట్ విధానంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సంజీవ, అజయ్, గౌస్, సురేష్, రవి, చంద్ర పాల్గొన్నారు.

వెండి హారతి పలక బహూకరణ



దాతలకు స్వామివారి జ్ఞాపికలను అందజేసి ఆశీర్వదిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పాతపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీరామలింగేశ్వరస్వామి వారికి పట్టణానికి చెందిన కేతపల్లి సుదర్శన్ గుప్త, హరిత దంపతులు 200 గ్రాముల వెండి హారతి పలకను బహూకరించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పూజల అనంతరం దాతలు అందజేశారు. దాత సుదర్శన్‌గుప్త మాట్లాడుతూ తన తండ్రి కేతపల్లి ఎర్ర వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం అందజేశామని చెప్పారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

బేతంచెర్ల: నంద్యాల రహదారిలోని అన్నపూర్ణ అనాథ ఆశ్రమం విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, రూ.10 వేల నగదును రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ అందజేశారు. బుధవారం రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ పక్కీరయ్య సహకారంతో ఆధ్వర్యంలో అందజేశారు. సభ్యులు గౌరి హుసేన్‌రెడ్డి, విజయ నాగరాజు, సత్తార్, మాణిక్యం, అహ్మద్ హుసేన్ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆత్మబంధువు సభ్యులు

డోన్: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద గత కొద్ది నెలలుగా యాచక వృత్తి చేస్తూ జీవిస్తున్న అనాథ వృద్ధుడు (80) బుధవారం మృతిచెందారు. దీంతో వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించాలని పట్టణ పోలీసు అధికారులు ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులను కోరగా, వారు హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. దాతలు మల్యాల శ్రీనివాసరెడ్డి, రాజయ్యగౌడ్‌లు సహకరించగా, సంస్థ సభ్యులు తాహెర్ బాషా, సయ్యద్‌వలి, శివారెడ్డి, రసూల్, షబ్బీర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంజామల: మండల కేంద్రం సంజామల, ఆకుమ ల్ల సబ్‌స్టేషన్ పరిధిలోని పీడర్లలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏ ఈ మధుసూదన్ యాదవ్ తెలిపారు. ముదిగేడులో విద్యుత్ మరమ్మతుల కారణంగా అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



ముచ్చట్ల మల్లికార్జున స్వామికి పూజలు నిర్వహిస్తున్న సీఐ దంపతులు



బుగ్గానిపల్లె గ్రామంలో బ్రహ్మసూత్ర సహిత నాగలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



కేదారేశ్వర దేవాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శంభో.. శివ శంభో!

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- భక్తులతో పోటెత్తిన శివాలయాలు
- ఘనంగా శివరాత్రి వేడుకలు
- యగంటిలో ఉమామహేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బనగానపల్లె రూరల్ : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని శివాలయాలు బుధవారం శివన్నామస్మరణతో మార్మోగాయి. మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరులకు టీటీడీ వారి పట్టువస్త్రాలను రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులు ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన ఉమామహేశ్వరులకు అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మంత్రి దంపతులకు ఆలయ సంప్రదాయమేరకు పూలమాలదుశ్శాలువాతో ఘనంగా సన్మానించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. శివరాత్రి సందర్భంగా ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాలను, రక్తదాన శిబిరాన్ని, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలను మంత్రి పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులకు ఆదేశించారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో భక్తులకు ఉచితంగా లడ్డూ పంపిణీ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారు జామున వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మలు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ ఉమా మహేశ్వర నిత్యాన్నదాన సంస్థ, రైతు అన్నదాన సంస్థ ఆర్యవైశ్య అన్నదాన సంస్థల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. యాగంటి క్షేత్రం చేరుకునేందుకు బనగానపల్లె ఆర్టీసీ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

ఆలయాల్లో పూజలు

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెట్నికోట సమీపంలోని గుండు మల్లేశ్వరస్వామి ఆలయంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సరస్వతి దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. జెడ్పీ చైర్మన్ సోదరుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అంకిరెడ్డిపల్లెలో మేళతాళాల మధ్య స్వామిని గ్రామంలోని వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.



పెట్నికోటలో పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి దంపతులు

రామతీర్థంలో ఘనంగా వేడుకలు

బనగానపల్లె : మండలంలోని రామతీర్థం గ్రామంలోని శివాలయం ప్రాంగణంలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ఓంశాంతి బ్రహ్మకుమారి సావిత్రి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు గుండం శేషిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలతో పాటు కాతా వెంకట సుబ్బారెడ్డి, మండ్ల భూపాల్‌రెడ్డి, చీరాల వెంకట స్వామి, కాటసాని పుల్లారెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని బుగ్గ రామేశ్వ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి

కోవెలకుంట్ల: స్థానిక గాంధీసెంటర్‌లో వెలసిన పంచముఖ సిద్ధేశ్వరస్వామి, కాశీవిశ్వనాథుని ఆలయాలు, ఏడుకొప్పెర్ల బావి సమీపంలో వెలసిన అగస్తీశ్వర స్వామి ఆలయం, గాంధీనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో వెలసిన శివాలయం, బనగానపల్లె చౌరస్తాలో నాగలింగేశ్వర స్వామి, రంగరాజుపేటలో కాళికామాత నాగలింగేశ్వరస్వామి ఆలయం, పాటిమీద పాత శివాలయం, మండలంలోని వెలగటూరు, బిజనవేముల, భీమునిపాడు, గుళ్లదూర్తి గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో శివరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకం, బిల్వార్చన, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, కలశస్థాపన, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ జపాలు, తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన మహిళలు ఆలయాలకు చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాల్లో గురువారం తెల్లవారుజామున ఉమామహేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. అలాగే మత సామరస్యానికి ప్రతీకగా పట్టణ శివారులోని జుర్రేరు ఒడ్డున అగస్తీశ్వర ఆలయంలో మొదటి రోజు శివరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగాయి. గురువారం నుంచి రెండు రోజుల పాటు నూర్‌షావలి దర్గాలో గంధం, ఉరుసు వేడుకలు ప్రారంభం కానున్నాయి.

డోన్ టౌన్ : మహా శివరాత్రిని పురస్కరించుకొని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. బుధవారం జాగరణ సందర్భంగా ఉదయం భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శివాలయాల్లో ఈశ్వరునికి అభిషేకాలు అర్చనలు, మహా మంగళ హారతులు, తీర్థప్రసాద వితరణలు చేశారు. పట్టణ సమీపంలోని శ్రీరామచంద్ర మాలిక్‌బాబా సంస్థాన్‌లో ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మాలిక్ బాబా సమాధికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.



యాగంటి క్షేత్రంతో భక్తుల క్యూలైన్



యాగంటిలో ప్రత్యేక అలంకారంలో శివపార్వతులు

బేతంచెర్ల: మండలంలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తులు తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో భక్తాదులు పుణ్యస్నానాలు ఆచరించి భ్రమరాంభ, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, కుంకుమార్చన , మహా మంగళహారతి నిర్వహించారు. బుధవారం ఉదయం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంనుంచి స్వామి అమ్మ వార్ల ఉత్సవ విగ్రహాలను నందికోల సేవ నిర్వహిస్తూ ఊరేగింపుగా ఆలాయానికి చేరుకున్నారు. స్వామివారిని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు, సీఐ డి.అశోక్ దంపతులు దర్శించుకున్నారు. పట్టణంలోని పూదోట మఠంలో అఖండ శివపంచాక్షరీ నామజపం, అర్చకుడు ప్రభాకర శర్మ ఆధ్వర్యంలో భేతేశ్వర శివలింగానికి ఆశ్రమ నిర్వాహకులు మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం జరిపించారు. దుర్గాపేటలోని సిద్ధేశ్వర స్వామి ఆలయం పూజలు చేశారు.

డోన్ : స్థానిక శ్రీనివాసనగర్‌లో వెలసిన కేదారేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం వేకువజామునసే భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ పురోహితులు నాగరాజుశర్మ పాల్గొన్నారు.

ప్యాపిలి: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక నీలకంఠేశ్వర స్వామి, ఈశ్వరస్వామి దేవస్థానం, కాశీ విశ్వేశ్వర దేవస్థానాలకు తెల్లవారుజామున నుంచే భక్తులు తరలివచ్చారు. పెద్దపాదిళ్ల రామలింగేశ్వర స్వామి దేవస్థానం, గొల్లపల్లి బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవస్థానం, పీఆర్ పల్లి పంచలింగాల దేవస్థానాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెట్టుపల్లి రామలింగేశ్వర స్వామి ఆలయానికి స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

డోన్ టౌన్ : పట్టణంలోని చిగురమానుపేటలో వెలసిన శ్రీ తిమ్మగురుడు పక్కీరప్ప తాత చిత్ర పటానికి గ్రామోత్సవం నిర్వహించారు. తాత ఆరాధనోత్సవాల్లో భాగంగా గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు తత్సంగం నిర్వహించి బుధవారం రాత్రి పట్టణ పుర వీధుల్లో తిమ్మగురుడు పక్కీరప్ప తాత చిత్ర పటానికి ట్రాక్టరులో ఉంచి గ్రామోత్సవం చేపట్టారు.



కోవెలకుంట్లలోని పంచముఖ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రామతీర్థంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గుండంశేషిరెడ్డి



పాతబుగ్గలో అభిషేకాలు చేస్తున్న భక్తులు



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి దంపతులు



విగ్రహప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు



ధ్యానమందిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

బనగానపల్లె : మండలంలోని యాగంటి క్షేత్రంలో యాగంటిబసవన్న గోశాలలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణపరమాత్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయన సతీమణి కాట సాని జయమ్మ పాల్గొని పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ముందుగా హోమం నిర్వహించారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి దంపతులు, కాశీరెడ్డి నాయన ఆశ్రమ పీఠాధిపతి గణపతిస్వామి, యాగంటి ఆలయ మాజీ చైర్మన్ బుచ్చిరెడ్డి, నందిపైపుల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాగంటిలో ధ్యాన మందిర ప్రారంభం

మండలంలోని పవిత్రశైవక్షేత్రమైన యాగంటి సమీపంలోని నాలుగుకాళ్ల మండపం వద్ద బుధవారం సదాశివ శ్రీగురుదక్షిణామూర్తి అచల ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్మించిన ధ్యానమందిరాన్ని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యాగంటి క్షేత్రంలో అధ్యాత్మిక కేంద్రాలు ఏర్పాటుకు తమవంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. .ధ్యాన మందిరాలు ఏర్పాటు వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాలరెడ్డి, యాగంటి ఆలయ మాజీ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఆశ్రమ పీఠాధిపతి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

యాగంటీశ్వరుడి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని మహాశివరాత్రి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయన సతీమణి కాటసాని జయమ్మ బుధవారం రాత్రి దర్శించుకున్నారు. వారికి ఆలయ సంప్రదాయం మేరకు ఈఓ చంద్రుడు ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువైన శివపార్వతులతో పాటు వినాయకుడు, నందీశ్వరుడికి పూజలు చేశారు. పూజల అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులను దుశ్శాలువాపూలమాలతో సన్మానించి స్వామివారి తీర్థప్రసాదం అందజేశారు.

శివ పార్వతులకు పల్లకీసేవ

బేతంచెర్ల : పట్టణంలోని పూదోట ఆశ్రమంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివ పార్వతులకు భక్త జనసందోహం మధ్య పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. పూదోట ఆశ్రమ నిర్వాహకులు గుండా గోపాల్ స్వగృహం నుంచి పల్లకీలో బేతేశ్వర స్వామి, శ్యామాలాంబ అమ్మవారిని పల్లకీలో కొలువుంచి శివనామ స్మరణ, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల విజేత గోనెగండ్ల

డోన్ రూరల్ : మండలంలోని దేవరబండ గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. గ్రామ పెద్దలు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. మొత్తం 36 జట్లు పాల్గొనగా గోనెగండ్ల గ్రామానికి చెందిన జట్టు విజేతగా నిలిచి రూ. 20 వేలు కైవసం చేసుకుంది. తరువాత స్థానాల్లో బి.బొంతిరాళ్ల రూ.15వేలు, బావిపల్లి రూ.10వేలు, గుడిమిరాళ్ల రూ.5వేలు, కడమకుంట్ల రూ.3వేలు కైవసం చేసుకున్నాయి. గెలపొందిన జట్లకు దాతలు, గ్రామ పెద్దలు నగదు బహుమతులను అందించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

నిందితులకు రిమాండ్

కోవెలకుంట్ల: పట్టణంలోని ఎస్ఎల్‌వీ సినిమా థియేటర్ వెనుక వీధిలో నివాసం ఉంటున్న గుద్దేటి హరిణి ఆత్మహత్యకు కారుకులైన నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ఎస్ఐ తెలిపిన సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన షేక్ సాదిక్ హుసేన్ అనే యువకుడు 2021వ సంవత్సరంలో హరిణిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్య, భర్తల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకున్న క్రమంలో మూడు రోజుల క్రితం హరిణి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. విచారణ చేపట్టిన పోలీసులు మృతురాలి సోదరుడు శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు హరిణి ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్త సాదిక్ హుసేన్, అత్తమామలు మహబూబ్‌బీ, జాఫర్ హుసేన్‌పై 306 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. నిందితులను స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

నోటీస్ బోర్డు

రేపు బండలాగుడు పోటీలు

బేతంచెర్ల: మండలంలోని బైనపల్లె గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 28వ తేదీన పాలపండ్ల విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి బండలాగుడు పోటీలు

కొలిమిగుండ్ల: పెట్నికోట సమీపంలోని గుండు మల్లేశ్వరస్వామి క్రీడా మైదానంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రోజు పాలపళ్ల విభాగం, రెండో రోజు న్యూ కేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు దాతల సహకారంతో నగదు బహుమతులు అందజేయనున్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



కబడ్డీలో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి సందర్భంగా పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు బుధవారంతో ముగిశాయి. కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. రాయలసీమ జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన జనం క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కబడ్డీ పోటీల్లో ప్యాపిలి జట్టు మొదటి బహుమతి కైవసం చేసుకుంది. పెట్నికోట ప్రసాద్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. కల్వటాల జట్టు మూడవ స్థానం, బేతంచెర్ల మండలం ఎంబాయి జట్టు నాల్గవ స్థానంలో నిలిచాయి. వీరికి దాతల సహకారంతో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతులమీదుగా వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు,రూ.8వేలను అందించారు. అలాగే బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో గుంటూరు జట్టు మొదటి బహుమతి సాధించింది. నంద్యాల నందిపైపుల జట్టు రెండు బహుమతి కైవసం చేసుకుంది. విజయవాడ జట్టు మూడవ స్థానం, అనంతపురం జట్టు నాల్గవ స్థానాల్లో నిలబడ్డాయి. విజేత జట్లకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలను అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, బహుమతి దాతలు, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

సత్తాచాటిన వెంకటగిరి ఎద్దులు

డోన్ రూరల్ : మండల పరిధిలోని దేవరబండ గ్రామంలో మహాశివరాత్రి, తిమ్మగురుడు తాత తిరుణాల సందర్భంగా బుధవారం నాలుగు పళ్ల విభాగం వృషభాలకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రామ పెద్దలు నారాయణగౌడ్, మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. మొత్తం 12 జతల ఎదుదలు పాల్గొనగా.. కర్నూలు జిల్లా , కోడుమూరు మండలం, వెంకటగిరి గ్రామానికి చెందిన షశాంక్‌శ్రేయ వృషభాలు విజేతలుగా నిలిచి రూ.40వేలు కైవసం చేసుకున్నాయి. తరువాత స్థానాల్లో కొత్తూరు గ్రామానికి చెందిన బిఎస్ఎస్. రెడ్డి రూ.30వేలు, వెంకటగిరి గ్రామానికి చెందిన షశాంక్‌శ్రేయ ఎద్దులు రూ.20వేలు, పీఆర్‌పల్లి గ్రామానికి చెందిన రంగనాయకులు ఎద్దులు రూ.10 వేలు, పందిర్లపల్లి గ్రామానికి చెందిన కానాలబాషా వృషభాలు రూ.5వేలు, ఉలిందకొండ గ్రామానికి చెందిన తిమ్మన్న ఎద్దులు రూ.4వేలు, ఏడవ బహుమతి తగ్గలి మండలానికి చెందిన సుస్మిత ఎద్దులు రూ.3వేలను కైవసం చేసుకున్నాయి.



వృషభ యజమానులకు బహుమతులు అందిస్తున్న గ్రామ పెద్దలు, దాతలు